ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 6 ఆగస్టు 2025





వేంపల్లెలో సంతకాల సేకరణలో పాల్గొన్న తులసిరెడ్డి

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

● ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణలో తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను బిగించవద్దని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. కరెంటు చార్జీల భారం ప్రజలపై మోపడం శోచనీయమని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వేంపల్లెలో కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తులసిరెడ్డి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి వైసీపీ, టీడీపీలు రాహువు, కేతువులుగా తయారయ్యాయని అన్నారు. జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే చంద్రబాబు కైలాసం చూపిస్తున్నాడని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని చెప్పిన జగన్ మాట తప్పి మడమతిప్పి ఐదేళ్లలో 9సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.32వేల కోట్లు ప్రజలపై భారం మోపాడన్నారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచం అని చెప్పి మొదటి సంవత్సరంలో రూ.15వేలకోట్లు, ప్రస్తుతం రూ.12వేలకోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపాలని చూడడం దారుణమన్నారు. ఎలక్ట్రానిక్ స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం బిగించేందుకు తహతహలాడుతోందని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీల నాయకులు వెంకటరామ్, చాంద్‌బాష, ఈశ్వరయ్య అమీర్‌బాష, మల్లేశ్, అనిల్, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిపై
గుర్తుతెలియని వ్యక్తుల దాడి 7

ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకొని
విద్యుత్ అంతరాయం 7

దేశానికి ఆదర్శంగా పీ4 అమలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ4 కార్యక్రమం దేశానికే ఆదర్శమని, అదే స్ఫూర్తితో జిల్లాలో కూడా దీనిని పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం అమరావతి నుంచి పీ4 అమలుపై కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జేసీ అదితి సింగ్, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 19 నుంచి పీ4 అమలు చేయాలన్నారు. పేదరిక నిర్మూలనకు చేపడుతున్న పీ4 లక్ష్యాన్ని 2029 నాటికి సాకారం చేసేలా జిల్లాలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమన్నారు. మార్గదర్శుల నుంచి అందే చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుందన్నారు. అదే స్ఫూర్తితోనే అవనిగడ్డ నియోజక వర్గానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు పల్లెకుంట హేమలత మార్గదర్శిగా మారి ఓ వృద్ధురాలిని ఆదుకుంటోందనే విషయాన్ని ఉదహరించారు. సాయం చేసే మార్గదర్శులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, కడప, జమ్మలమడుగు ఆర్డీవోలు జాన్ ఇర్వీన్, సాయిశ్రీ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హౌసింగ్ లేఔట్

● దాదాపు సగం ప్లాట్లు ఖాళీ
● ఊరి చివర ఉండడంతో ఆసక్తి చూపని లబ్ధిదారులు
● కొందరు స్థలాలు వెనక్కి ఇచ్చిన వైనం
● జగన్ అనాలోచిత నిర్ణయంతో ఈ దుస్థితి

(కడప-ఆంధ్రజ్యోతి): తమ హయాంలో వేల ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకునేందుకు అన్నట్టుగా జగన్ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఏటా ఇంటి నిర్మాణం వ్యయం పెరుగుతుంటుంది. పేదల సంక్షేమం కోరుకుంటే అందుకు తగ్గట్లుగానే నిర్మాణ వ్యయాన్నీ పెంచాలి. కానీ వైసీపీ హయాంలో జగనన్న ఇళ్ల పేరిట ఇళ్లు మంజూరు చేశారే కానీ.. ఇంటి నిర్మాణానికి సరిపడా డబ్బు ఇవ్వలేదు. దీనికి తోడు ఇళ్ల స్థలాలు ఎక్కడో ఊరికి దూరంగా ఇచ్చారు. దీంతో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోక, ఇళ్లు పూర్తయినా నిత్యం ఊరిలోకి రాకపోకలు సాగించేందుకు తడిపిమోపెడు ఖర్చు వస్తుందని కొందరు అక్కడ ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపలేదు. మరి కొందరు ఇచ్చిన పట్టాలు వెనక్కి ఇచ్చేశారు. అందుకే చాలా చోట్ల లేఅవుట్లలో స్థలాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.



కనుపర్తిలోని లేఅవుట్‌లో పునాదులకే పరిమితం అయిన ఇళ్ల నిర్మాణాలు



కనుపర్తిలోని లేఅవుట్ దారిలో ముళ్లకంపలు పెరిగిన దృశ్యం

జగన్ హయాంలో జిల్లా వ్యాప్తంగా 429 లేఅవుట్లు వేశారు. కడప, ప్రొద్దుటూరులో స్థలాలు కొనుగోలు చేసి, మిగతాచోట్ల ప్రభుత్వ స్థలాల్లో లేఅవుట్లు వేశారు. ఈ లేఅవుట్లు ఊరికి ఎక్కడో పది కిలోమీటర్లు దూరంగా, గుట్టల్లో కొండల్లో వేసేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం లేఅవుట్లలో 1,15,749 ప్లాట్లు ఉండగా వాటిలో 67,469 ఇళ్లు మంజూరయ్యాయి. అంటే మిగతా వారు అక్కడ వసతులు లేక ఇళ్లు కట్టుకోవడానికి సుముఖత చూపలేదు.

కడప మినహాయిస్తే మిగతా చోట్ల ఒకటిన్నర సెంటు చొప్పున స్థలం కేటాయించారు. ఎక్కడో ఊరిబయట స్థలాలు ఇవ్వడంతో పాటు అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు. హడావుడిగా ఉపాధి పనుల ద్వారా లెవలింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా వాటర్ ఇలా సుమారు రూ.70కోట్లకు పైగా లేఅవుట్లకు ఖర్చు పెట్టారు. ప్రైవేటు వ్యక్తులే లేఅవుట్ వేస్తేనే రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తారు. ఇవన్నీ ఉంటేనే అక్కడ స్థలాలు కొనేందుకు ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు వస్తారు. అయితే వైసీపీ హయాంలో ప్రభుత్వం వేసిన లేఅవుట్లలో ఎగుడు దిగుడు రోడ్లు, నీటి వసతి లేదు. దీంతో స్థలాలు తీసుకున్న వారిలో కొందరు ఇళ్లు కట్టుకోకపోగా మరికొందరు వెనక్కు ఇచ్చేశారు. ఇక్కడ లేఅవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలు, వసతుల కల్పనకు చేసిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను ఏవిధంగా పరిష్కరిస్తుందా అని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


లేఅవుట్లు, మంజూరైన ఇళ్ల వివరాలు

నియోజకవర్గం	లేఅవుట్స్	ప్లాట్స్	మంజూరు
బద్వేలు	60	9,768	5,871
జమ్మలమడుగు	78	7,786	5,187
కడప	15	23,696	20,680
కమలాపురం	48	4,412	1,844
మైదుకూరు	60	6,860	3,807
ప్రొద్దుటూరు	35	47,998	18,506
పులివెందుల	101	13,533	10,540
రాజంపేట (ఒంటిమిట్ట-సిద్దవటం)	32	1,696	1,030
మొత్తం	429	1,15,749	67,465

శనగల వ్యాపారి ఆత్మహత్య

● తన చావుకు వీరే కారణమంటూ 18 మంది పేర్లతో లేఖ

ప్రొద్దుటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లకు, అవమానాలకు తాళలేక గుళికల మందు తాగి శనగల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. భాకరాపేటకు చెందిన ఉండేల ఓబులరెడ్డి (52) శనగల వ్యాపారం నిమిత్తం పట్టణంలోని పలువురు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, తనకు రావాల్సిన చోట డబ్బులు రాకపోవడంతో అప్పు ఇచ్చిన వారి ఒత్తిడి పెరిగింది. దీనిని తట్టుకోలేక మంగళవారం ఉదయం 7.45 గంటలకు పొట్టిపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో గుళికలు మింగి తాగేశాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఓబులరెడ్డి చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. కాగా అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రూరల్ ఎస్‌ఐ



తన చావుకు వీరే కారణమంటూ ఓబులరెడ్డి రాసిన లేఖ

అరుణ్ రెడ్డి అక్కడకు వెళ్లి బాధితుడితో మాట్లాడారు. అలాగే మరణ వాగ్మూలం నమోదు కోసం జడ్జి సైతం ఆసుపత్రికి వచ్చారు. తన ఆత్మహత్యకు పట్టణంలోని



ఉండేల ఓబుల రెడ్డి (ఫైల్‌ఫొటో)

పలువురు వ్యాపారులు కారణమంటూ వారి పేర్లను వెల్లడించినట్లు సమాచారం. దీనికితోడు తన మరణానికి కారణమంటూ ప్రముఖ ధనియాల వ్యాపారి వైసీపీ నేత శేగిరెడ్డి గంగిరెడ్డి, యిరిగెల గోపాల్‌రెడ్డి, బ్రోకర్ ఈశ్వరయ్య, లక్ష్మీరెడ్డి పేర్లు తన చేతిపైన రా సు ంకు ంన్నాడు. అంతేకాక తన మరణానికి కారణమైన 18 మంది పేర్లను ఓబులరెడ్డి చేతిరాతతో రాసిన లేఖను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓబులరెడ్డి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. కాగా.. శేగిరెడ్డి గంగిరెడ్డి మరో ముగ్గురు గత రాత్రి ఓబులరెడ్డిని మిల్లులోకి పిలిపించి అప్పు కట్టాలని దారుణంగా బూతులు తిడతూఊ అవమానించి కొట్టారని ఆ అవమానం తాళలేక మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు.

కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. అనంతరం డీటీసీ చుట్టు పక్కల ఉన్న పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే డీటీసీలో మరమ్మతులు పనులు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్, డ్రిల్ ఏరియాను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎస్పీ వెంట డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు

రూ.5 కోట్ల పంచాయతీ స్థలానికి కంచె..!

పోరుమామిళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మేజరు పంచాయతీలో సర్వే నెంబరు 16లో సుమారు రూ.5 కోట్ల విలువైన పదిసెంట్ల స్థలానికి పీర్ల కమిటీలోని కొందరు కంచె వేయడం వివాదంగా మారింది. ఈ విషయం కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఓబులేసు సంఘటన స్థలానికి వెళ్లి వారిని వారించే ప్రయత్నాలు చేశారు. దీంతో అక్కడున్న వారు ఇది గ్రామచావిడి స్థలమని, మొహర్రం వేడుకల సందర్భంగా గుండానికి ఉపయోగించుకుంటున్నామని, ప్రస్తుతం ఇక్కడ పరిసరాలు అపరిశుభ్రం చేస్తుండటంతో కంచె వేస్తున్నామని తెలిపారు. కాగా.. ఇది గ్రామ పంచాయతీ స్థలమని, దీనికి తీర్మానం కూడా చేశారని, అనుమతులు లేకుండా కంచె వేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారు. ఇంతలో అక్కడికి జనాలు గుంపు చేరడంతో తహశీల్దార అక్కడి నుంచి వెళ్లిపోయారు. పంచాయతీ కార్యదర్శి ఓబులేసు మాత్రం ఈ స్థలం గ్రామ పంచాయతీదని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పాత్రికేయులతో అన్నారు.



పోరుమామిళ్ల 1వ సచివాలయం ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలంలో కంచె నాటిన దృశ్యం



తహశీల్దారు, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ముగ్గురు ప్రభుత్వ ఏజీపీలకు ఉద్వాసన 6
కడప పట్టణాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా శాంతిప్రసాద్

మంచి ప్రభుత్వాన్ని ఆదరించండి

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి తదితరులు

పులివెందుల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రభుత్వాన్ని ఆదరించి ప్రతి ఒక్కరు కూటమి అభ్యర్థి మారెడ్డి లతారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నల్లపురెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం సాగించారు. ముందుగా యర్రబల్లె పంచాయతీ పరిధిలోని దాదాపు వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, ఆయన సతీమణి లతారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తదితరులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యర్రబల్లె చెరువు ద్వారా 14 గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని తెలిసిన గత పాలకులు ఆ చెరువుకు నీరందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ 400 కిలోమీటర్ వద్ద నుంచి రోజుకు 30క్యూసెక్కుల నీరందించేందుకు పైప్‌లైన్ కూడా పూర్తయిందని త్వరలోనే నీరు వస్తుందన్నారు. అలాగే అరటి రైతులను కమీషన్లకు కక్కుర్తి పడి ఇబ్బంది పెట్టిన వారు ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. టీడీపీకి మద్దతు తెలిపిన వారు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కనంపల్లె, ఇ.కొత్తపల్లె గ్రామాల్లో పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి.

బరిలో 22 మంది

● పులివెందులకు 11, ఒంటిమిట్టకు 11 మంది పోటీ
● పులివెందులపైనే అందరి ఫోకస్
● పోటాపోటీగా ప్రచారాలు
● ప్రశాంత ఎన్నికల కోసం కలెక్టర్, ఎస్పీ గురి
● డ్రోన్ కెమెరాలతో నిఘా



ఎన్నికలపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితి సింగ్

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 12న జరగనున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. పులివెందుల నుంచి 11 మంది పోటీ చేస్తుండగా ఒంటిమిట్ట నుంచి కూడా 11 మందే బరిలో ఉన్నారు. పులివెందుల టీడీపీ అభ్యర్థిగా మారెడ్డి లతారెడ్డి, వైసీపీ నుంచి తుమ్మల హేమంత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మొయిళ్ల శివకళ్యాణ్‌రెడ్డి పోటీలో ఉన్నారు. మరో 8 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. ఇక ఒంటిమిట్ట నుంచి టీడీపీ అభ్యర్థిగా అద్దలూరు ముద్దుక్రిష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నుంచి పూల విజయభాస్కర్, మరో 8 మంది ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. దీంతో రెండు స్థానాలకు కలిపి 22 మంది బరిలో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నెల 12న ఉప ఎన్నిక జరగనుంది. మంగళవారం పులివెందుల, ఒంటిమిట్టలో టీడీపీ, వైసీపీ హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు.

అందరి దృష్టి పులివెందుల పైనే

పులివెందుల ఉప ఎన్నికపైనే అందరి దృష్టి ఉంది. సోషల్ మీడియాలో కూడా పులివెందుల ఎన్నికపై ఆరా తీస్తున్నారు. జగన్ సొంత గడ్డ కావడంతో, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి మారెడ్డి లతారెడ్డి బరిలో ఉండటంతో ఈ స్థానానికి ప్రాధాన్యం పెరిగింది. ఎలాగైనా దీనిని గెలుచుకోవాలని టీడీపీ పట్టుదలగా ఉంది. మంగళవారం కూటమి ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జమ్మలమ డుగు ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి ముమ్మ రంగా ప్రచారం నిర్వహించారు. ఇక వైసీపీ కూడా అవినాశ్‌రెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి కోసం ప్రచారం చేస్తున్నారు. గతంలో పులివెందులలో వైఎస్ కుటుంబాన్ని ఎదిరించి నామినేషన్ వేసేందుకు ఎవరూ సాహసించేవారు కాదు. జగన్ హయాంలో ఇతరులు నామినేషనే వేయలేని పరిస్థితి ఉండేది. అయితే కూటమి ప్రభుత్వంలో వైసీపీతో పాటు ఇతరులూ స్వేచ్ఛగా నామినేషన్లు వేశారు. టీడీపీలోకి వలసలు వస్తుండడంతో సహజంగానే వైసీపీ జీర్ణించుకోలేక పోతోంది. వైసీపీ బెదిరింపులకు పాల్పడుతోందని టీడీపీ ఆరోపిస్తుండగా.. టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. దీంతో ఇక్కడ ఎన్నిక ఉద్రిక్తత కలిగిస్తోంది.

ఒంటిమిట్టలో..

ఇక ఒంటిమిట్టలో టీడీపీ అభ్యర్థిగా అద్దలూరు ముద్దుక్రిష్ణారెడ్డిని ఖరారు చేశారు. వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. టీడీపీ టికెట్ కోసం పలువురు పోటీ పడ్డారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ మంగళవారం మంటపం పల్లెలో ప్రచారం నిర్వహించారు. పలు కుటుంబాలను వైసీపీ నుంచి టీడీపీలోకి చేర్చుకున్నారు.

కలెక్టర్ సమీక్ష

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుక కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో ఓబులమ్మతో కలసి ఆర్వోలు, ఏఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, మొబైల్ కనెక్టివిటీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, మ్యాన్‌పవర్, ట్రైనింగ్, సరిహద్దుల్లో చెక్‌పోస్టులు, తదితర అంశాలపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

డ్రోన్లతో నిఘా

ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రచారం సందర్భంగా ఎలాంటి గొడవ జరగకుండా ఉండేందుకు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. పులివెందులలోని కనంపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఆర్‌తుమ్మపల్లెలో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఒంటిమిట్ట మండలంలో సమస్యాత్మక గ్రామాలైన చింతంరాజుపల్లె, జాండ్లపల్లె, బోయపల్లె గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌తో పాటు కార్డన్ సెర్చ్ చేశారు. డ్రోన్లతో నిఘా ఉంచారు.

ఉపాధి పనులా.. ప్చ్..!

● కూలీలకు అందని బిల్లులు ● పనులున్నా.. ఆసక్తి చూపని కూలీలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పనులు మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కు అన్న చందాన సాగుతున్నాయి. వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు ఉపాధి హామీ పనులపై అనాసక్తి వ్యక్తం చేస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో 7,799 జాబ్ కార్డులు ఉండగా, 14,034 మంది కూలీలు ఉన్నారు. 2024లో 2,05,559 మంది పని చేశారు. ప్రస్తుతం యాక్టివ్ జాబ్ కార్డులు 6,214 ఉండగా ఇందులో 10,636 మంది పని చేశారు. పని చేసిన కుటుంబాలు 4,493, ప్రభుత్వం రూ.5.34 కోట్లతో వివిధ గ్రామాల్లో రోడ్లు, సచివాలయాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3.38 కోట్లు ఖర్చు చేశారు. ఇక మండలంలో ఉపాధిహామీ ద్వారా వివిధ గ్రామాల్లో ఫారంపాండ్‌లు 67, రైతుల పొలాల్లో బౌండరీ ట్రెంచ్‌లు 111, పండ్లతోటలు 179 మంది రైతులకు గానూ 470 ఎకరాల్లో పండ్ల తోటలు ఏర్పాటు చేశారు. కాలువల్లో పూడిక తీత 26 కాలువ పనులు చేపట్టారు. 2023-24 గృహనిర్మాణలకు 407 ఉపాధిహామీ ద్వారా రూ.87.15 లక్షలు బిల్లులను పెట్టారు. ఇక 574 జాబ్‌కార్డుకు 100రోజులు పని పూర్తి కాగా, ప్రస్తుతం 1163 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇక మండలంలో 67 ఫారంపాండ్లకు సంబందించి రూ. 7.19 లక్షలు, 111 బౌండరీ ట్రెంచ్‌లకు రూ. 41.26 లక్షలు, 179 మంది రైతులు 470 ఎకరాల్లో పండ్లతోటలకు గాను రూ. 114.79 లక్షలు, 26 కాలువల్లో పూడిక తీత పనులకు రూ. 23.57 లక్షలు బకాయిలున్నట్లు ఉపాధి సిబ్బంది సమాచారం అందించారు.



రంగసముద్రం చెరువు పక్కన నీటి కుంట పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

రైతు పనుల పైనే ఆసక్తి..

గతంలో ఉపాధి పనులకు పెద్ద ఎత్తున కూలీలు హాజరయ్యేవారు. ప్రస్తుతం వారంతా వ్యవసాయ పనులకే ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ పనులకు వెళితే డబ్బులు ఎప్పటికప్పుడు చేతికి అందుతాయని భావిస్తున్నారు. ఉపాధి హామీ పనులకు వెళితే ఆ సొమ్ము ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి అందుకే వ్యవసాయ పనులకు వెళుతున్నట్లు ఉపాధి కూలీలు ఖరాఖండిగా చెబుతున్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మంది కూలీలు పని చేసేలా చూడాలని, ప్రతి ఒక్కరికి పనులను కల్పించాలని ప్రభుత్వం అంటున్నా.. గ్రామాల్లో ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపడం లేదు.



రాపూరివాండ్లపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు

అవగాహన కల్పించినా ప్రయోజనం శూన్యం...

ఉపాధి పనులపై ఎప్పటికప్పుడు కూలీలకు అవగాహన కల్పించినా ప్రయోజనం లేకుండా పోతోందని ఉపాధి సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం కనీస కూలి 307 రూపాయలు ఉన్నా కూలీలు మాత్రం చొరవ చూపడం లేదు. ఉన్నతాధికారులు ఓ వైపు కింది స్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేస్తుండగా, వారు గ్రామాల్లో ఎన్ని సదస్సులు పెట్టినా కూలీలు మాత్రం ససేమిరా అంటున్నారు. గతంలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండడం, కూలీల అవసరాలకు డబ్బులు సమకూరకుండా పోవడం నిరాసక్తతకు కారణంగా చెబుతున్నారు

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా, అన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నప్పుడు ఉపాధిహామీ పనులకు కూలీలు సక్రమంగా హాజరయ్యే వారు. ప్రస్తుతం ఏడు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు అవసరం కాగా , ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇక అభియోగాల నేపథ్యంలో ఏపీవో తిరుపాలప్పను పక్కన పెట్టారు. ఆయన స్థానంలో జేఈగా ఉన్న సుధాకర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించ్చారు. సిబ్బంది కొరత ఓ వైపు, కూలీలు పనులకు రాకుండా పోవడంతో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి బకాయిలు చెల్లించడంతోపాటు చాలినంత మంది సిబ్బందిని నియమిస్తే కూలీల శాతం పెరిగే అవకాశం ఉంది.

మున్సిపల్ కార్మికుడిపై దాడి

● నలుగురిపై కేసు నమోదు



దాడిలో గాయపడిన సుధాకర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఫిట్టర్ సుధాకర్‌పై దాడి చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు గాంధీపురం వాసులు రాజా, రవి, ప్రదీప్, మరికొందరితో కలిసి సోమవారం దాడి చేసి గాయపరిచారని తెలిపారు. వ్యక్తిగత కక్షలతోనే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. గాయపడిన సుధాకర్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేసి ఫిట్టర్‌పై దాడి చేసి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



గాయత్రి (ఫైల్ ఫొటో)

నిమ్మనపల్లి ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యం కావడంతో భర్త నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు వాసి నరేష్ భార్య గాయత్రి(22) ఇంటి వద్ద వుంటూ కుటుంబాన్ని చూసుకునేది. అయితే తాను పెయింటింగ్ పనుల కోసం మదనపల్లి వెళ్లగా సోమవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిందని ఫిర్యాదు చేశాడు. కాగా వీరికి ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాజధాని ప్రీమియర్ లీగ్ రన్నర్స్‌గా పీలేరు జట్టు



రన్నర్స్ ట్రోఫీతో పీలేరు ఐబీటీ విద్యార్థులు

పీలేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జరిగిన రాజధాని ప్రీమియర్ లీగ్ టీ 20 క్రికెట్ టోర్నీలో పీలేరుకు చెందిన ఇండియన్ బీచ్ ట్రీ(ఐబీటీ) పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. హైదరాబాదు టీ20 అసోసియేషన్ పీపీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎనిమిది టీమ్‌లు పాల్గొనగా ఫైనల్స్‌లో హైదరాబాదు ఏఎంసీ జట్టు చేతిలో పీలేరు జట్టు పరాజయం పాలై రన్నర్స్‌గా నిలిచినట్లు ఐబీటీ ప్రిన్సిపాల్ భార్గవి, కరస్పాండెంట్ సుదర్శన్ నాయుడు తెలిపారు.

రుణ ప్రణాళికలపై అవగాహన కల్పించాలి

వీరబల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రుణ ప్రణాళికలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ జీవనోపాధికి ఎంత రుణం కావాలి, ఎప్పుడు కావాలి అను వివరాలు యాప్‌లో బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు సంబంధించిన బ్యాంక్ మేనేజర్‌కు వెళతాయ న్నారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాలు సక్రమంగా పుస్త కాలతోపా సమావేశాలు సక్రమంగా నిర్వహించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు గంగార్జున, వెంకట్రమణ, లీగల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, స్థానిక ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, సుధాకర్, గంగాధరం, నాగేంద్ర, గ్రామ సమాఖ్యల సిబ్బంది అందరూ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ బండి సత్యనారాయణ

ముగ్గురు ప్రభుత్వ ఏజీపీలకు ఉద్వాసన

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాలోని మూడు న్యాయ స్థానాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సహాయ న్యాయవాదుల సేవలను ఉపసంహరిస్తూ ప్రభుత్వం మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా పనిచేస్తున్న సి.పవన్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వం తొలగించింది. 2023 ఆగస్టు 22న ఆయనను మూడేళ్ల పదవీ కాలంతో ప్రభుత్వ ఏజీపీగా నియమించింది. అదే విధంగా అన్నమయ్య జిల్లా నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ల కాల వ్యవధితో సమీవుల్లా ఖాన్‌ను ఏజీపీగా నియమించారు. ఇదే జిల్లాలో తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2024 ఫిబ్రవరి 27న మూడేళ్ళ పదవీ కాలంతో బి.నాగమల్‌రెడ్డిని ఏజీపీగా నియమించారు. ఈ ముగ్గురి సేవలను పాలనాపరమైన సౌలభ్యత కోసం ఉపసంహరించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది. నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనల ప్రకారం తొలగిస్తున్నట్లు కూడా ప్రభుత్వం తెలిపింది. కాగా ఈ ముగ్గురికి తొలగింపు గడవు నెలరోజుల వ్యవధిలో వున్నందున ఒక నెల గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ఆయా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు ఆటంకం కలగకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జీలుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా తొందరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం మూడు వేర్వేరు ఆదేశాలు జారీ చేశారు.

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

● ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ

● జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

తంబళ్లపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బిందు సేద్యంతో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం ఏటిగడ్డతండాలో ఎస్టీ రైతులకు సూక్ష్మ నీటి సాగుపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాదికి 14000 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఐదెకరాలు లోపు పంట పొలాలున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వంద శాతం రాయితీ, ఓసీ, బీసీ రైతులకు 90 శాతం రాయితీ, 10 ఎకరాల విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90 శాతం రాయితీ అందజేస్తుందన్నారు. డ్రిప్ పరికరాలు అవసరమున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ జిరాక్సు, భూమి పాసుపుస్తకం, వన్-బీతో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలియచేశారు. ప్రభుత్వం గుర్తించిన 30 కంపెనీల పరికరాల్లో ఏ కంపెనీకి చెందినవైనా రైతులు తీసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న పదిహేను రోజుల్లో రైతులకు పరికరాలు అందజేస్తా మన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓ రైతు పొలంలో విక్రయానంతర సేవలు (ఏఎస్ఎస్) కార్యక్రమం నిర్వహించి రైతులకు- మైక్రో ఇరిగేషన్ పరికరాల నిర్వహణ, నీటి, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మైక్రో ఇరిగేషన్ పద్ధతులు అవలంభించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులతో మంచి ఆదాయం పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఐ డీసీ హరినారాయణ, ఎంఏఓ వెన్నెల, ఎంఐ కంపెనీల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు వివరిస్తున్న జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

మామిడి సాగులో రైతులకు అవగాహన

రామసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాప్పల్లెలో మామిడికాయ కోతనంతరం తీసుకోవాల్సిన చర్యలపై రైతు లకు అవగాహన చేపట్టారు. మదనపల్లి ఉద్యాన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ తరఫున రైతులకు మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ వంటి పండ్ల తోటలకు రాయితీపై మొక్కలు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు మల్చింగ్ పేపర్‌కు, పూల మొక్కలు, కూరగాయల సాగుకు ఎకరాకు రూ.8వేలు రాయితీ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎవరైనా పాలీహౌస్, షేడ్‌నెట్‌హౌస్ నిర్మించుకుంటే 50శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో కాయల కోత అనం తరం చేయాల్సిన యాజమాన్య పద్దతులపై వివరిస్తూ కొమ్మ కత్తిరిం పులు, ముదురు చెట్ల పునరుద్దరణ, తల మార్పిడి విధానం, కొత్తగా చెట్లు నాటి రైతులు ట్రైనింగ్, ప్రూనింగ్ చేయాల్సిన పద్దతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల ఏఓ జాఫర్, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రంలో మంగళవారం మేరా రేశం.. మేరా అభిమాన్ పట్టురైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతయ్య, పరుషోత్తం రైతులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టు రైతులకు అనేక సబ్సిడీ పథకాలను అందిస్తోందని, కేంద్ర ప్రభుత్వం అందించే పలు సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాలపై రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులు పట్టు పురుగులను పెంచేలా చూడాలన్నారు. మదనపల్లె అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సిరికల్చర్(ఏడి) రామమోహన్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగార్జున, చెరువు సంఘం ఛైర్మన్ చెన్నకేశవులు, టీడీపీ నాయకులు మహబూబ్‌బాష, సాంకేతిక సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె కనిపించడం లేదంటూ సిద్దవటం మండలం లింగంపల్లె వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ఈ గ్రామానికి చెందిన సుభాషిణి అనే విద్యార్థిని టక్కోలి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. ఆగస్టు 2న స్కూలుకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీయగా ఉమ్మడి ఆంజనేయులు అనే వ్యక్తి ఆమెను ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని తేలింది. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

కడప పట్టణాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా శాంతిప్రసాద్

కలికిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో కడప పట్టణాభివృద్ధి సంస్థ తరఫున కేసులను వాదించడానికి అడ్వకేటు సింగలూరి శాంతిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కడపతో పాటు చిత్తూరు, కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థల తరఫున కూడా శాంతిప్రసాద్ హైకోర్టులో న్యాయ వ్యవరాలను పర్యవేక్షించనున్నారు. మూడేళ్ళ వరకూ గానీ లేదా ఆలోగా తొలగించే వరకూగానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని, గతంలో వున్న నిబంధనల మేరకు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభసాటి

పీలేరురూరల్, ఆగస్ట్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని పీలేరు ఏడీఏ రమణ రావు తెలిపారు. మంగళవారం దొడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, అవగాహన, తాము అనుసరించాల్సిన సాంకేతికత, వ్యవసాయ విధానాల్లో మార్పులపై వివరించారు. డాక్టర్ పవన్‌కుమార్, ఎంపీడీఓ జి.శివశంకర్, పీలేరు, కేవీపల్లె మండలాల వ్యవసాయ అధికారుల సుభా షిణి, సుబ్బరామయ్య, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి, అల్తాఫ్, నజీర్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

తలనీలాల వేలం రూ.5.10 లక్షలు

సిద్దవటం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజేశ్వరకోనలో సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31వ తేది వరకు తలనీలాలు సేకరించేకునే హక్కులకు మంగళవారం ఆలయ ఇన్‌చార్జి ఈవో శ్రీధర్, దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. సిద్దవటంలోని రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నిర్వహించిన ఈ వేలంలో కమలాపురానికి చెందిన నాగయ్య రూ.5.10 లక్షలకు హక్కులు దక్కించుకున్నారని ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. గత ఏడాది కన్నా ఈ సారి రూ.2.28 లక్షలు అదనపు ఆదాయం లభించిందని వివరించారు.

నేడు మినీ ఉద్యోగ మేళా

రాయచోటిటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు మినీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరంలోని షిర్డీసాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, ట్రైనీ సూపర్‌వైజర్, హెచ్‌ఆర్ ట్రైనీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మొత్తం ఖాళీలు 52 ఉండగా వాటిలో ట్రైనీ క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 20 ఉన్నాయని, ఆ పోస్ట్ కోసం బీఎస్సీ ఎంపీసీ చదివి ఉండాలని, సైట్‌కు వెళ్లి క్వాలిటీ టెస్టింగ్ చేయాల్సి వస్తుందని, జీతం రూ.15 వేలతో పాటు టీఏడీఏలు ఉంటాయని తెలిపారు. ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టులు 30 ఉన్నాయని, ఆ పోస్టులకు ఏదైనా డిగ్రీ చదివి ఉండాలని జీతం రూ.15 వేలతో పాటు టీఏ, డీఏలు ఉంటాయని వివరించారు. ట్రైనీ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 2 ఉండగా, జీతం రూ.18 వేలు ఉంటుందని, జిల్లా పరిధిలోని నిరుద్యోగులు రెస్యూమ్, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. ఉద్యోగంలో చేరే వారు 5 ఏళ్లకు బాండ్ ఇవ్వాల్సి ఉంటుందని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

● మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు



పీలేరులో చెత్త సేకరణలో పాల్గొన్న డీఎల్‌పీఓ

పీలేరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు హెచ్చరించారు. మంగళ వారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి పంచాయతీ కార్యాలయం సహా పట్టణంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా శానిటేషన్‌పై ప్రత్యేక చొరవ చూపాలని, ఎటువంటి మినహాయింపులు ఉండవన్నారు. విధినిర్వహణలో కార్యదర్శులు ఆద్యంతం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. మురుగునీటి కాల్వల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో మురుగు నీరు రహదారులపైకి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పీలేరు పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ లతీఫ్‌ఖాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు

● జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై



వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి సారిగా మన రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందు బాటులోకి తెచ్చిం దని జిల్లా పశువైద్యాధి కారి గుణశేఖర్‌పిళ్లై, ఎంపీడీవో రాధాకృష్ణన్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచా యతీ కార్యాలయం నుంచి ప్రజల చేతిలో ప్రభుత్వం.. వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన పి4 గ్రామసభలో వారు మాట్లా డుతూ మనమిత్ర 955230 0009కు వాట్సాప్ నంబరు ద్వారా అందించే 200 ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సచివా లయ సిబ్బందికి సూచించారు. నాగిరెడ్డిపల్లె, నందలూరు సచివాలయంలో ఇప్పటివరకు 100 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసేందుకు ట్రస్టులు, గ్రామ పెద్దలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాగిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి బండ్ల సురేష్‌కుమార్, వెంకటరమణ, వెంకట సుబ్బయ్య, సచివాలయ పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివశంకర్

రాజంపేటటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండి దానివల్ల కలిగే లాభాలను వివరించాలని విశ్రాంత ఐఏఎస్, ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రబల్లెలో వీఏఏలు, వీహెచ్ఎల్స్‌కు మూడు రోజుల పాటు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండానే సహజ సిద్ధమైన పద్ధతులతో సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. రసాయనాల వాడకంతో భూమిలో పోష్టిక విలువలు తగ్గిపోతాయన్నారు. దీనివల్ల మనం తీసుకునే ఆహారంలో సూక్ష్మ పోషకాలు తగ్గి అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నారన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో నీటిపారుదల సౌకర్యం లేని మెట్ట భూముల్లో కూడా ఏడాదికి మూడు పంటలు పండించవచ్చని వివరించారు. ఈ పద్ధతులతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల ఉప వ్యవసాయ సంచాలకులు ఏడీఏ శివశంకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు హార్టికల్చర్ సహాయకులు వెంకటరమణనాయక్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె మండలం, పోతబోలు గ్రామంలోని శ్రీవేద పాఠశాల్లో నిర్వహించిన రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల పుట్‌బాల్ చాంపియన్ క్రీడల్లో డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలను స్పోర్టివ్‌గా తీసుకోవాలన్నారు. విజేతలకు మెమొంటోలు అందించి అభినందించారు. సబ్ జూనియర్ చాపియన్ షిప్‌లో భాగంగా 8 జోన్‌ల నుంచి 9 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం కడప, 11వ స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో అనమయ్య జిల్లాల జట్లు నిలిచారని పుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఇందులో ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, దిలీప్‌కుమార్, కోచ్ హరి, పవన్, శ్రీనివాసులు, సురేష్, ఉమాదేవి, మహేంద్ర, ఇర్షాద్, అంజనప్ప, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగేనా..!

- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వంలో అయినా మొదలయ్యేనా..
- ఆశగా ఎదురుచూస్తున్న గ్రామీణప్రాంత ప్రజలు



పోరుమామిళ నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు

పోరుమామిళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా.. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో దాదాపు రద్దు అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి అంచనాలు వేసి ప్రస్తుత రేట్ల ప్రకారం నిధులు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. నిధులు మంజూరైతే గ్రామీణ రహదారులకు మహర్దశ వస్తుందని ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పోరుమామిళ్ల నుంచి బాలరాజుపల్లెకు వెళ్లే రంపాడు రోడ్డు. దాదాపు 70 గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి. రంపాడు నుంచి బాలరాజుపల్లె మీదుగా అటు అమగంపల్లె, ఇటు నరసాపురం, జ్యోతి క్షేత్రం వరకు ఈ రహదారి అనుసంధానంగా ఉంటుంది. దీంతో విద్యార్థులు, వ్యాపారస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నుంచి రెండు లైన్ల రహదారి నిర్మాణానికి (సుమారు 12 కి.మీ) రూ.32కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి రాజకీయ పరిస్థితులు, కాంట్రాక్టర్లు రోడ్డు పనులు పనిచేసేందుకు ముందుకు రాకపోవడంతో ఆ పనులు రద్దయ్యాయి. దీంతో ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. రోడ్డు విస్తరణ పనులు చేపడితే రైతులు తాము పండించిన పంటలను పోరుమామిళ్లకు తరలించుకునేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రంపాడు రోడ్డు నుంచి బాలయపల్లె వరకు దాదాపు ఒక కి.మీ వరకు సింగల్ రోడ్డు ఉండడంతో నివాసగృహాల ముందు చెత్త చెదారాలు నిల్వ ఉండడం, డ్రైనేజీ కాల్వలు సరిగా లేక ఈ ప్రాంతమంతా అధ్వానంగా తయారైంది. ఈరహదారి నిర్మాణానికి నిధులు మంజూరైతే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానిక ప్రజలు అంటున్నారు.

ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ సలీంను వివరణ కోరగా గత ప్రభుత్వ హయాంలో పోరుమామిళ్లలోని రంపాడు రోడ్డు నుం చి బాలరాజు పల్లె వరకు సుమారు 12 కిమీ సంబంధించి రూ.32 కోట్లు నిధులు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టకపోవ డంతో రద్దయ్యాయని, ప్రస్తుతం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. తిరిగి నిధులు మంజూరైతే ఆ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

వైవీయూలో ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంబీఏ శాఖలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌గా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ విద్యాపీట్ ఎంఎంసీఏ విభాగ ప్రొఫెసర్ జి.శ్రీధర్ హాజరయ్యారు. వైవీయూ ప్రొఫెసర్ ఏజీ దాము, కామర్స్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ పి.సరిత, డాక్టర్ గంగయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల మైక్రోటీచింగ్‌ను, అకడమిక్ ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిగణలోకి తీసుకొని ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని వారు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ పురుషుల (ఆర్ట్స్) కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ కోర్సు లేదా తత్సమాన కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన ఆగస్టు 21 నుంచి 23 తేదీలలో జరుగుతుందన్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు 21 నుంచి 24వ తేదీ వరకు, వెబ్ ఆప్షన్ల మార్పునకు ఆగస్టు 25 వరకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల కోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సీట్లను ఆగస్టు 27వ తేదీకి కేటాయిస్తారని, తరగతులు ఆగస్టు 28 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు.

క్యాన్సర్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ ఆగ స్టు 5,(ఆంధ్రజ్యోతి) ఎన్‌సీడీ-4.0 సర్వేలో ఉన్న క్యాన్సర్లపై వైద్య సిబ్బందికి మెరుగైన శిక్షణ, అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీ-4.0 సర్వేలో గుర్తించిన సర్వేలపై సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన గైనకాలజిస్టులు, డెంటల్ వైద్యులతో పాటు ఇతర వైద్య సిబ్బంది తాము పనిచేస్తున్న కేంద్రాలలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలకు తదుపరి శిక్షణలు ఇవ్వాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసరు డాక్టర్ రమేష్, డాక్టర్ జీవన్‌ప్రియల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కడప, అన్నమయ్య జిల్లాలోని సెకండరీ హెల్త్ సెక్టార్‌లో పనిచేసే గైనికాలజిస్టులు, డెంటల్ వైద్యులు, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టుకున్న పాము, పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రేగిన దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకొని విద్యుత్ అంతరాయం

కొండాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కాతోట సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు పాము చుట్టుకోవడంతో మెయిన్‌లైన్ తీగలకు షార్ట్ సర్క్యూట్ జరిగింది. అలాగే కొండాపురం సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చేలరేగాయి.. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు ఏఈ వీరారెడ్డి తెలిపారు. మంగపట్నం ఫీడర్‌తో పాటు కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఏడుగంటల దాకా, కొండాపురం టౌన్ పరిధిలో కొంతవరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నప్పటికీ ఎక్కువ మొత్తంలో లైన్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయందని తెలిపారు. పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు రావడంతో కడప నుంచి టెక్నికల్ సిబ్బంది వచ్చి మరమ్మత్తులు చేశారని, దీంతో ఆలస్యం అయిందన్నారు. మంగపట్నం ఫీడర్‌లో దాదాపు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడిపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తాహిర్‌హుసేన్ తెలిపారు. రవీంద్రనగర్ గుర్రాలగడ్డకు వెళ్లే బుగ్గవంక దారి సమీపంలో ఈనెల 3న చాంద్‌బాషా అనే యువకుడిపై ఇస్మా యిల్ మరో ముగ్గురు కలిసి కత్తితో దాడి చేశారు. గాయపడ్డ చాంద్‌బాషా రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో నిందితులైన ఇస్మా యిల్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని.. మైనర్లను ప్రభుత్వ బాలుర గృహానికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాజుపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు బీసీ కాలనీకి చెందిన మాబుషరీఫ్ (26) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మాబుషరీఫ్ తల్లి పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ... వ్యక్తికి గాయాలు

పులివెందుల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉలిమెల్ల రింగురోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం 1.40గంటల ప్రాంతంలో జగనన్న హౌసింగ్ లేఅవుట్ రోడ్డు నుంచి సతీష్‌కుమార్‌రెడ్డి వస్తూ.. రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో సతీష్‌కుమార్‌రెడ్డి తలకు, కాళ్లకు రక్తగాయాలయ్యాయి. ఇతను యూసీఐఎల్‌లో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

లింగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుణకనపల్లె గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుణకనపల్లె గ్రామానికి చెందిన లోమడ శ్రీనివాసులు బెల్టుషాపులో మద్యం అమ్ముతుండడతో దాడి చేసి.. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కులుకు భజన కళాకారుడు ఆకస్మిక మృతి



పుల్లయ్య (ఫైల్)

కలసపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హృద యపేటకు చెందిన కులుకు భజన కళాకారుడు, రాష్ట్ర హంస అవార్డు గ్రహీత సగిలి పుల్లయ్య అకస్మిక మృతి చెందారు. సోమవారం రాత్రి ప్రొద్దుటూరు ప్రాంతంలోని ఓ గ్రామంలో జరిగిన కోలాటం కార్యక్రమంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలి పడి పోయాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా, పుల్లయ్య ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో తన కులుకు భజనతో అకట్టుకొని అనేక అవార్డులు అందుకున్నారు. పలువురుకి తన విద్య నేర్పి భజన గురువులుగా తయారు చేసి ఉపాధి కల్పించారు. ఆయన మృతిని తోటి కళాకారులు, శిష్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆయన మృతదేహాన్ని టీడీపీ, వైసీపీ నాయకులతో పాటు వివిధ చర్చిల ఫాదర్‌లు, కళాకారులు, భారీగా ప్రజలు తరలివచ్చి నివాళులు అర్పించారు.

పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకం

చెన్నూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కీలకమని కేంద్ర పరిశీలకుల బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డిలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండలానికి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు మంగళవారం కొక్కిరాయపల్లె గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు పరిశీలించి.. స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పంటకాల్వల్లో పూడికతీత, గోకులం షెడ్లు, రోడ్లను పరిశీలించారు. అలాగే ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి.. ఎంత మంది కూలీలు వస్తున్నారు.. రోజూ ఎంత కూలి పడుతోందని ఆరా తీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అలాగే ప్రతి పంచాయతీలో ఏటా వచ్చే నిధులతో ఎలాంటి పనులు చేపడుతున్నారు.. ఆ పనులతో ఆయా గ్రామాల ప్రజలకు కలిగే ప్రయో జనాలు, ప్రతి నెలా పింఛను సక్రమంగా అందుతుందా, లేదా పింఛనుకు దరఖాస్తు చేసుకుంటే ఎన్ని రోజులకు వస్తుంది.. తదితర వాటి గురించి ప్రజలను అడిగి తెలుసుకుఅన్నరు. కేంద్రం అందించే ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఒక్కరికీ పూర్తిస్థాయిలో అందేలా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీడీలు సుబ్బారెడ్డి, రామలింగారెడ్డి, ఆనంద్, రఘు, పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, కార్యదర్శి రేణుకాదేవి పాల్గొన్నారు.



కొక్కిరాయపల్లెలో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డి

జిల్లాలో ఎనాక్ట్స్ ప్రాజెక్ట్ అమలుకు అవగాహన ఒప్పందం

కడప కలెక్టరేట్, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహార-వ్యవసాయ కన్వర్జెన్స్ (ఎనాక్ట్స్) అనే కార్యక్రమాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసేందుకు జిల్లా పరిపాలనా యంత్రాంగం, ఇండియన్ స్కూలు ఆఫ్ బిజినెస్, హైదరాబాద్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డిజిటల్ సైన్ చేసిన అవగాహన ఒప్పంద పత్రాన్ని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, టీఐపీపీ అసోషియేట్ ప్రొఫెసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్వినీ ఛాత్రేకి సంబంధిత ప్రాజెక్ట్ ప్రతినిధి అధికారుల సమక్షంలో సమర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ఐఎస్‌బీ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చే నిధులతో సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహారపదార్థాల లభ్యత, పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగు పరచడానికి సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్ అనే పైలెట్ ప్రాజెక్ట్ జిల్లాలో అమలు కానుందన్నారు. అంగన్వాడీలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషణ విలువలతో కూడిన ఆహారం, పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా జిల్లాలో ఆయా శాఖలతో సమీక్షించి క్షేత్రస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం అవుతారన్నారు. ఎనాక్ట్స్‌లో రాపిడ్ రెస్పాన్స్ రీసెర్చ్ (ఆర్ఆర్ఆర్) అనే ప్రత్యేక విభాగం ఉందని, ఇది జిల్లా స్థాయిలో వ్యవసాయ-పోషకాహార కలయికను తెలియజేయడానికి, ఆయా రంగాలకు మద్దతు ఇవ్వడానికి, సకాలంలో డిమాండ్ ఆధారిత స్థల ఆధారిత పరిశోధనలను చేయడానికి రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎనాక్ట్స్ ప్రతినిధులు వైష్ణవి, స్మృతి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరకు మార్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యాన తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎనాక్ట్స్ ప్రాజెక్ట్‌పై ఒప్పందం కుదుర్చుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం

కడప రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఔట్‌ల నియంత్రణకు అవకాశం కల్పించిందని డీపీవో రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రయ ఒప్పందం, హక్కు పత్రంలో ఉన్న అనధికార లేఔట్ లేదా ప్లాట్‌కు 90 రోజుల్లో వ్యక్తిగతంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందన్నారు. కొత్త దరఖాస్తుల కోసం ఆగస్టు 4 నుంచి ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు. 50 శాతం ఓపెన్ స్పేష్ చార్జీలు తగ్గింపు ఉంటుందన్నారు. 4000 చదరపు మీటర్ల లోపు విభజన లేకుండా ఉన్న ప్లాట్‌కు కూడా అర్హత ఉంటుందన్నారు. ఇప్పటికే ఐపీఎల్‌పీ ఆమోదించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 9849966639 నెంబర్‌లో కుడా ఏపీవోను సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షల తనిఖీ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కేంద్రంగా జిల్లాలోని అన్ని డిగ్రీకళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షలు మంగళవారం ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ పరీక్షలకు 278 మంది హాజరు కాగా ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారి మాస కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధం



మాస కల్యాణ మహోత్సవానికి సిద్ధమైన కల్యాణ మండపం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబల మాస కల్యాణ మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మందిరాన్ని అలంకరణ చేసి సిద్ధం చేశామన్నారు. కల్యాణ మహోత్సవ ఉభయదాతలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి


పులివెందుల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అంకిరెడ్డి సురేష్‌రెడ్డి (సైదాపురం చంటి), అతని అనుచరుడు అమరేశ్వర్‌రెడ్డిలపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పులివెందుల పట్టణంలోని శ్రీకర్ కళ్యాణమండపం సమీపంలో ఈ దాడి జరిగింది. వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వీరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకే మా పార్టీ నాయకుడిపై దాడి చేశారన్నారు. ఏడాది కాలంగా ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా ఓట్లకు వెళితే ఓడిపోతామని హత్యా రాజకీయాలకు తెర లేపారన్నారు. హజ్ కమిటీ మెంబర్ మహబూబ్ బాష, అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి మరి కొందరు కర్రలతో దాడి చేశారన్నారు. కాగా, ఈ దాడికి సంబంధించి బీటెక్ రవి ఒక వీడియో విడుదల చేసి మాట్లాడారు. సురేష్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన అవినాశ్‌రెడ్డి మా పార్టీ నాయకుడని సంబోధించడం సరైంది కాదన్నారు. సురేష్‌రెడ్డి జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నారన్నారు. అతన్ని తమ పార్టీ నాయకుడిగా ఎంపీ ఎలా ప్రకటిస్తా రన్నారు. సురేష్‌రెడ్డిపై దాడి చేసి జగన్ మామ అయిన ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రికి తరలించారన్నారు. దాడి చేస్తే ప్రభుత్వ ఆసు పత్రికి తరలించాలి తప్ప ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి నుంచి వచ్చి కుట్లు వేయడం, తుడవడం లాంటివి చేశారన్నారు. ఇపుడు సురేష్‌రెడ్డికి ఏదైనా ఇంజక్షన్ గాని చేసి ప్రాణహాని కలిగిస్తే ఎన్నికలు ఆగిపోతాయనే దురుద్దేశం దాగి ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. వెంటనే పోలీసులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించాలన్నారు.



సురేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న బీటెక్ రవి



పారిశుధ్యం.. అధ్వానం..!

చినుకు పడితే చిత్తడే ● చెత్త సేకరణను మానేశారు ● ఇది గ్రామాల్లోని రోడ్లు,వీధుల పరిస్థితి

పెండ్లిమర్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):పరిశుభ్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లను నియమించి గ్రామాల్లో చెత్త సేకరించి దాని నుంచి సంపద సృష్టిం చాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసింది.ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా కొన్ని చోట్ల ఆచరణ జరగడం లేదు. చెత్త సేకరణను పూర్తిగా మరిచిపోయారు. కొద్దిపాటి వర్షం పడ్డావీధులు వంకలుగా మారుతున్నాయి.సీసీ రోడ్లు లేని చోట చినుకు పడితే చిత్తడి చిత్తడిగా వీధుల్లో అడుగు వేయాలంటే నరక యాతన పడాల్సిందే. మండల పరిధిలోని ఉలవలపల్లె, నందిమండలం గ్రామాల్లో కొన్ని చోట్ల సీసీ రోడ్లు ఉన్నా ఇళ్లల్లో నుంచి వృథా నీరును రోడ్లపైకి వదులుతుండటంతో అ





నందిమండలం గ్రామంలో అధ్వానంగా ఉన్న వీధులు

వీధుల్లో తిరగ లేక పోతు న్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్‌ఐలు ఇళ్లలో నుంచి నీటిని బయటికి వదిలితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో నీటిని వదిలేవారు కాదు. కానీ మరలా పరిస్థితి మొదటికి వచ్చింది. డ్రైనేజీ కాలువలు లేక పోవడం ఇబ్బందిగా ఉంది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేస్తున్నా కొన్ని చోట్ల పారిశుధ్యం పనులు జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రం నుంచి యాదవా పురం, కొత్తపల్లె, చెర్లోపల్లె గ్రామాలకు వెళ్ల దారి కొన్నేళ్లుగా వర్షాలు వస్తే రోడ్డు చిత్తడి చిత్తడిగా మారి ఆ దారిలో వెళ్లలేని పరిస్థితి. ఐతే ఈ రోడ్డుకు పీఎంజీఎస్‌వై-4 పథకం కింద ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. కొన్ని గ్రామాల సమీపంలో చెత్తను ఎత్తకుండా వదిలేయడంతో వర్షాలు వస్తే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇక మరీ ముఖ్యంగా కడప-పులివెందుల ప్రధాన రహదారిపై నందిమండలం, వెల్లటూరు గ్రామాలలో కొద్దిపాటి వర్షం కురిసినా ఆ రోడ్డు కాలువలను తలపిస్తాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వర్షాలు రాక మునుపే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు5,(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో వేడుకల ముందస్తు ఏర్పాట్లపై జేసీ అదితి సింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 15న స్థానిక పోలీసు పరేడ్‌లో నిర్వహించే వేడుకలపై చర్చించారు.ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్వాతంత్ర్య వేడుకలు విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్,సాయిశ్రీ, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, పీపీవో హజరత్తయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీలు త్వరలోనే కార్యరూపం : కలెక్టర్

కడప కలెక్టరేట్,ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలోని పలు కుటుంబాలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్లలోని బోర్డు మీటింగ్ హాలులో గూడెం చెరువు గ్రామంలోని కుటుంబాలకు సీఎం ఇచ్చిన హామీలను అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కాగా ఈ నెల 1న జమ్మలమడుగు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రికి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ,డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు జయసింహ,సరస్వతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజానికి కృషిచేయాలి

కడప క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు అన్నారు. మంగళవారం ఈగల్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌డీపీఎస్ చట్టాలు, ఎన్‌డీపీఎస్ చట్టంలోని కఠిన శిక్షలు వివరించారు. ఇంటి సమీపంలో లేదా కళాశాల సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి విక్రయాలపై సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి, నార్కోటిక్ సెల్ ఎఎస్‌ఐ మల్లయ్య, ఈగల్ హెడ్‌కానిస్టేబుల్ అయుబ్‌ఖాన్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

పెండ్లిమర్రి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నందిమండలం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి ప్రోత్సాహకంగా సోమవారం క్రీడా సామగ్రిని వితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు.క్రీడల వల్ల శారీరక,మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

చెన్నూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల వరకు తల్లి బిడ్డకు ఇచ్చే పాల వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజరు గురమ్మ అన్నారు. చెన్నూరు బెస్తకాలనీలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అక్కడ ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు.అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె..: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం అని పాయసంపల్లె సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. మంగళవారం పాయసంపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. పిల్లల తల్లులకు తల్లిపాల వారోత్సవాలపై అవాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పనిచేసే ఫోన్లు అంగన్వాడీలకు ఇవ్వాలి



పనిచేయని ఫోన్లను చూపుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

వేంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన ఫోన్‌లు నెట్‌వర్క్ సరిగా పనిచేయడం లేదని దీనితో ఆఫీస్ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదని అంగ న్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సరస్వతి, శైలజ, శాంత, ప్రభావతి, లక్ష్మీదేవి పేర్కొన్నారు. పనితీరు మెరుగు పడాలంటే సక్రమంగా పనిచేసే కొత్త ఫోన్‌లను అందించాలని కోరారు. కాగా మంగళవారం వేంపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఈ ఫోన్‌లతో పనిచేయలేమంటూ సీడీపీఓకు ఫోన్లను అందజేశారు. ఇదే ఫోన్లతో పనిచేయలేమంటూ నిరసన తెలిపారు. గతంలో అనేక సార్లు చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కొత్త ఫోన్‌లను అందించి సక్రమంగాపని జరిగేలా సహకరించాలని వారు కోరారు.

మండల చిన్నారికి అత్యున్నత పురస్కారం



చిన్నారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగాయపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి, దీపిక కుమార్తె అన్నిక (5)కు నోబెల్ వరల్డ్ రికార్డు వారు మెడల్, సర్టిఫికెట్‌ను అందించినట్లు చిన్నారి తల్లిదండ్రులు తె లిపారు. వారి వివరాల మేరకు.. ఈ సంవత్సరం జూలై 27వతేదీన ఆన్‌లైన్‌లో జరిగిన పోటీల్లో తమ కుమార్తె అన్నిక తెలుగు సంవత్సరాల పేర్లు (60) కేవలం 25 సెకన్లలో చెప్పడంతో నోబెల్, కలాం వరల్డ్ రికార్డులో చోటు దక్కిందని వారు తెలిపారు. తమ కుమార్తె గత నెలలో ఆన్‌లైన్‌లో ఈ జరిగిన పోటీల్లో ఈ రికార్డు సాధించిందని అనంతరం వారు ఆన్‌లైన్‌లో అంతా వెరిఫై చేసుకున్నారని తెలిపారు. దీంతో నోబెల్ వరల్డ్‌రికార్డు వారు సర్టిఫికెట్, మెడల్‌ను 5న అందించారని వారు తెలిపారు. ఈ మెడల్‌ను సర్టిఫికెట్‌ను ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఎస్పీ అశోక్‌కుమార్‌ను కూడా కలిశామని, ఆయన ఈ నోబెల్, కలాం వరల్డ్ రికార్డులో చోటు దక్కినందుకు చిన్నారిని అభినందించారని తెలిపారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

లింగాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్య సమస్యలపైన, అసంక్రమితంగా వచ్చే వ్యాధుల గురించి అవాహన కల్పించాలని పులివెందుల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయిద్దీన్ అన్నారు. లింగాల పీహెచ్‌సీలో మంగళవారం ఆశాకార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయని, తల్లిపాల వలన బిడ్డలకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి జరిగే నులిపురుగుల దినోత్సవంను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్నకుమార్ డాక్టర్లు శరణ్య, గౌతమి, సూపర్‌వైజర్లు కుసుమకుమారి, అయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు అసౌకర్యం కలుగకుండా చూస్తాం

ఎస్‌బీఐ ఆర్‌ఎం కిశోర్

వేంపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బంగారు రుణాలు పొందిన ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కిషోర్ తెలిపారు. వేంపల్లె స్టేట్ బ్యాంకులో బంగారు రుణాలకు సంబంధించి రెన్యువల్ చేసే సమయంలో వడ్డీతో పాటు అసలు చెల్లించాలని స్థానిక అధికారులు చెబుతుండడంతో రుణాలు తీసుకున్న ఖాతాదారులు, రైతులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మిగతా బ్యాంకుల్లో కేవలం వడ్డీచెల్లిస్తే రెన్యువల్ చేస్తుండగా వేంపల్లె స్టేట్ బ్యాంకులో అసలు కూడా చెల్లించాలని మెలికపెట్టడం ఖాతాదారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక విలేకరులు ఆర్‌ఎం కిశోర్ దృష్టికి తీసుకెళ్లగా రుణాలు తీసుకున్న వారికి రెన్యువల్ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు.

'చెత్త పన్ను వసూళ్లలో పూర్తిస్థాయి విచారణ జరపాలి'

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో చెత్త పన్ను వసూళ్లపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పత్రికలలో చెత్తపన్ను పాలకవర్గానికి, అధికార పార్టీకి చేరిందని విభిన్న కథనాలు వస్తున్నాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పాలకవర్గంగా చెత్త పన్ను పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో చెప్పడంతో పాటు తీర్మాణం కూడా చేయడం జరిగిందన్నారు. ఒకవేళ చెత్త పన్ను వసూలు జరిగితే 40 లేదా రూ.60కంటే ఎక్కువ వసూలు చేయవద్దని కూడా చెప్పామన్నారు. క్లాప్ కార్యక్రమంలో భాగమైన అడిషనల్ కమిషనర్‌ను చెత్త పన్ను వసూళ్లలో పెరిగిన అక్రమాలపై విచారణ అధికారిగా నియమించడం తగదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిస్తే ఆందోళన తప్పదు

కార్పొరేషన్ ఎదుట టీడీపీ నిరసన



మాట్లాడుతున్న టీడీపీ కార్పొరేటర్ సుబ్బారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా చెత్త పన్నులు రద్దుచేసిందని ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచేలా ఆలోచిస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని టీడీపీ కార్పొరేటర్లు హెచ్చరించారు. చెత్త పన్నుపై విచారణ వేగవంతం చేయాలని కోరారు. మంగళవారం కార్పొరేషన్ ఎదుట టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. అనంతరం టీడీపీ నేతలు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన అవినీతి ఒక ఎత్తయితే గతంలో క్లాప్ ప్రోగ్రాం సమయంలో నెలకు సుమారు కోటి రూపాయాల మేర అవినీతి జరిగిందని కార్పొరేషన్‌కు జమచేసిన కలెక్షన్లు చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రస్తుతం 13నెలల్లో రూ.8కోట్లు అవినీతి జరగిందన్నారు. ఇక్కడి పాలకవర్గం వారే కాబట్టి వారికి ఎంత కలెక్షన్ వస్తుందనే విషయం వారే తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, బాలకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జఫ్రుల్లా, పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల నిలువుదోపిడీ ఆపాలి

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్‌ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని, విద్యుత్ చార్జీల నిలువుదోపిడీ ఆపాలని మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద జరిగిన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 9సార్లు కరెంటుచార్జీలు పెంచి, రూ.32వేలకోట్లు భారం వేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చార్జీలు పెంచబోమని తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చారు. ఆదాయాలు పెరగక, కరెంటు బిల్లులు కట్టలేక జనం అవస్థలు పడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటరు బిగింపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కమలా పురంలోని స్థానిక విద్యుత్ ఏఈ ఆఫీసు వద్ద స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏఈకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి రామ్మోహనరెడ్డి, వరప్రసాద్, గంగయ్య, రాయప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు మణిరెడ్డి, రాజానీ పాల్గొన్నారు.



కడప..విద్యుత్‌భవన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ఘనంగా రాహుకాల పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు, అలంకారంలో విజయదుర్గాదేవి

కడప కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప శ్రీ విజయదుర్గా ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో రాహుకాల పూజలు చేయడానికి జిల్లా నుంచి కాక రాయలసీమ ప్రాంతం ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతం, అలాగే శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక అభిషేకం, చండీహోమం, 108 దీపాలతో దీపాలంకరణ సేవ నిర్వహించనున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలి

జేసికి వినతి పత్రం అందజేసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు



జేసి అదితి సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

కడప కలెక్టరేట్, ఆగస్టు 5 ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు రామసుబ్బారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల కోర్కెల సాధనలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జర్నలిస్టు సంఘ నేతలు రామసుబ్బారెడ్డి, బాలకృష్ణారెడ్డి,ఎబీఎన్ శ్రీనివాసులు, వెంకటరెడ్డి తదితరులు జేసీ అదితి సింగ్‌ను కలసివినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో పలు పత్రికల బ్యూరోలు, జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

8న సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతిపై, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8వ తేదీ శుక్రవారంఉదయం 10గంటలకు కార్పొరేషన్ ఆఫీస్ వద్ద సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎంనగర కార్యదర్శి రామమోహన్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నగరంలోని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కొత్త జీవోను రద్దుచేయాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా కూటమి ప్రభుత్వం తెచ్చిన జీఓను రద్దుచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్సీ రామ గోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.



పులివెందుల మండలంలోని ఈ.కొత్తపల్లెలో మంగళవారం బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన కుటుంబాలు

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలను డ్వాక్రా సంఘం మహిళలు సద్వినియోగం చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేపట్టి కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలని మైదుకూరు క్లస్టర్ స్త్రీనిధి మేనేజరు గూగూడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం అసిస్టెంట్లకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మైదుకూరు క్లస్టరు ఎల్‌సీసీ శ్రీనివాసులు, మండల సమాఖ్య ఏపీఎం జి.చిన్నఓబులేసు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు బాలయ్య, నారాయణరావు, సీతారామిరెడ్డి, సుబ్బరాయుడు, నర్మద, గ్రామసంఘం అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుగా జీలుగలు

చాపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వరి పైరు సాగు చేసేందుకు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుములను ఉపయోగించాలని మండల వ్యవసాయాధికారి దేవీపద్మలత తెలిపారు. చియ్యపాడు, తప్పెట ఓబాయపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులు మేలైన విత్తన వరి వంగడాలను కొనుగోలు చేయాలన్నారు. నారుకయ్యల్లో నారు పెరికిన తర్వాత అయిదు పిలుకలకన్నా ఎక్కువ కాకుండా మొక్కలు నాటాలన్నారు. రసాయనిక ఎరువులను తక్కువగా ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రైతులు నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు తరలిరావాలి

మైదుకూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలనాథ స్వామి ఆలయ గిరి ప్రదక్షిణకు భక్తులు తరలి రావాలని ఆలయ నిర్వాహకులు హజరత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా ఈనెల 9వ తేదీన జరిగే ఆలయ గిరిప్రదక్షిణకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి హాజరవుతారని తెలిపారు. ఆలయంలో 8వ తేదీన వరలక్ష్మి వ్రతం హోమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

మైలవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మరణించడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేపరాల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైలవరం మండల సీపీఎం నాయకులు సంజీవరాయుడు, కొండయ్య, లక్ష్మినారాయణ, దాసు,సూరి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పోరుమామిళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెడ్‌కానిస్టేబులు దుర్గామోహన్ అన్నారు. ఎస్‌ఐ కొండారెడ్డి ఉత్తర్వుల మేరకు మంగళవారం పోరుమామిళ్లలోని పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వక్తిని అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత పరీక్షలు

ఎర్రగుంట్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో దిగ్వాంగులకు ఏఎల్ఐఎంసీఎం సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. దిగ్వాంగుల వివరాలను ప్రభుత్వానికి పంపుతారని, అర్హులైన దావ్యాంగులను ఎంపిక చేసి ప్రభుత్వం ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

● సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు


పోరుమామిళ్లలో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ వామపక్షాల నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తే పగలకొట్టాలని గతంలో టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టారని, వారే నేడు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అదాని సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని టీడీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించి కోర్టుకు కూడా వెళ్లారని, అధికారంలోకి రాగానే అదే అదాని కంపెనీ ద్వారా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, శివారెడ్డి, రామకృష్ణ, హరి, ప్రమీళ, సుజాత, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ ప్రైవేటీకరణ సరైంది కాదు'

బద్వేలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవారంగంలో ఉన్న విద్యుత్ సంస్కరణలను ప్రైవేటీకరిస్తూ పార్లమెంటులో చట్టం చేశారని, ఇది సరైనది కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల విధానం వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ప్రజలపై విద్యుత్‌భారాలు రూ.32 వేల కోట్లు వసూలు చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చి రెండు కోట్ల విద్యుత్ కనెక్షన్లను అదాని కంపెనీకి ఒప్పందం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివకుమార్, శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జకరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పై భారం మోపవద్దు

కొండాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించి ప్రజలపై భారం మోపవద్దని సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం కొండాపురం సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాలు, ఆశావర్కర్లు, యూనియన్ నాయకులు మనోహర్ బాబు, జయంత్, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

ముద్దనూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగుంపును ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి మంగళవారం డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందించారు. స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, చరణ్, చంద్ర, అజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

మైలవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, అలాగే ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. మంగళవారం స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, లక్ష్మినారాయణ, సంజీవరాయుడు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌మీటర్లను పగులగొడతాం'

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఎక్కడ బిగించినా పగులగొడతామని సీపీఐ మండల సీనియర్ నాయకులు సోమిరెడ్డిపల్లె నారాయణ హెచ్చరించారు. మంగళవారం సీపీఐ నాయకులు విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈఈ రవిశంకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రవి, కుమార్, లోకేశ్, సుమంత్ సురేంద్ర, నితిన్, ఎమ్మార్పీఎస్ నాయకులు చెండ్రాయుడు, వీరయ్య పాల్గొన్నారు.

నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

మైదుకూరు రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు డిమాండు చేశారు. మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, శ్రీరాములు, పజా ఐక్యవేదిక నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అదాని ఆస్తుల పెంపు కోసమే..

పోరుమామిళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అదాని ఆస్తుల పెంపు కోసమే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని సీపీఐ, సీపీఎం నాయకులు ఆరోపించారు. మంగళవారం వామపక్ష నేతలు మెడకు విద్యుత్ వైర్లు బిగించుకుని నిరసన తెలిపారు. పోరుమామిళ్ల పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషను వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏడీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్, కేశవ, గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం మోపడం దుర్మార్గం

బి.కోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలపై భారం మోపడం దుర్మార్గమని, స్మార్ట్‌మీటర్ల ఆలోచనను విరమించుకోకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి.కోడూరు విద్యుత్ కార్యాలయం దగ్గర సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు ఎన్‌డీఏ కూటమి కరెంటు చార్జీలు పెంచమని, స్మార్ట్‌మీటర్లు బిగించబోమని చెప్పి అధికారంలోకి రాగానే ప్రజలపై అధిక భారం మోపేందుకు కుట్ర పన్నుతోందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎర్రబల్లె ప్రసాదరావు, ఏరియా సమితి సభ్యులు చెన్నయ్య, లూర్దయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.


కొండాపురంలో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు

ప్రైవేటు ఉపాధ్యాయులకూ ఉత్తమ అవార్డులు అందించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలో అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాలని ప్రైవేటు టీచర్స్, లెక్చలర్స్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎంతో మంది పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారని, ర్యాంకులు సాధించడానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల పిల్లలు ప్రైవేటు పాఠశాలలోనే చదువుకుంటున్నారని, వారి పిల్లలను ర్యాంకర్లుగా తీర్చిదిద్దిన ఘనత ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకే దక్కుతుందన్నారు. వారి శ్రమను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాలని డిమాండ్ చేశారు.

వరి నారు కొనలు తుంచి నాటడం ఉపయోగకరం

కాశినాయన, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతులు వరి నాటే సమయంలో నారు కొనలను తుంచి నాటడం వలన తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చునని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం చెన్నవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి, మినుము పంటల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యకమరంలో ఏఈవో రవి, వీపీఏలు పావణి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల తొలగింపునకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ ఈఈ, డీఈలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు కురిసే అవకాశం వున్నందున కాలువల్లో పేరుకున్న పూడికను తొలగించేం దుకు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం దాదాపు రూ.7లక్షల నుండి రూ.8లక్షల వరకు ఖర్చు చేయనున్న ట్లు తెలిపారు. అలాగే పట్టణంలో 12చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే కొన్ని రోడ్లపై వర్షపు నీళ్లు నిలబడే చోట తాత్కాలిక పనులు చేపట్టడానికి మరో రూ.10లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈఈ శ్రీనివాసులు, డీఈలు రాజేష్, ఈశ్వర్‌రెడ్డి, ఏఈలు దస్తగిరి, వినోద్ పాల్గొన్నారు.

వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం : సీపీఐ

జమ్మలమడుగు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం వైసీపీ బాటలోనే వెళుతుందని జమ్మలమడుగు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని విద్యుత్తు శాఖ ఏడీ రాజగోపాల్‌కు స్మార్ట్ మీటర్ల సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం తొమ్మిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచి రూ.32వేల కోట్లు ప్రజలపై భారం వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సైతం ఆదాని కంపెనీకి, సేకి సంస్థ ద్వారా 25 సంవత్సరాలపాటు ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం వేయడాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, సీపీఐ కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, నాగేంద్ర, విజయకుమార్, సుమన్, ఎద్దుల జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశీ, ఏపీ విద్యుత్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ హెచ్ 180 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో విద్యుత్ కార్మికుల సమస్యలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎన్నిగంటలు పనిచేసినా ఉద్యోగ భద్రత లేదని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. అనుభవం, నైపుణ్యం, విద్యార్హతలు ఉన్నప్పటికి తక్కువ వేతనాలు చెల్లించడం దారుణమన్నారు. కార్మికులకు రెగ్యులర్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్180 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, హెచ్64 యూనియన్ నాయకుడు సాంబశివారెడ్డి, రాము, హెచ్155 యూనియన్ నాయకుడు విజయ్, సుబ్బరాయుడు, గంగాసురేష్, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మినారాయణ, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపును వెంటనే విరమించుకోవాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీలు పెంపును, స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో సోమిరెడ్డిపల్లె, తోట్లపల్లె, మల్లేపల్లె సచివాలయాల వద్ద సంబంధిత సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. అధికారంలోకి రాగానే అలాగే అదానీతో కొనసాగడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు అధిక ధరలు చెల్లించలేక వ్యవసాయం మా నుకొనే పరిస్థితి వస్తోందని, వెంటనే స్మార్ట్‌మీ టర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో గోవిందు, హరి, అజయ్, రాహుల్, భాగ్యమ్మ, అరవింద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీలకు త్వరలోనే కార్యరూపం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలోని పలు కుటుంబాలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కాగా ఈనెల 1న జమ్మలమడుగు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రికి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ పోస్టులో ముఖ్యమంత్రి దంపతులకు చేనేత వస్త్రాలు


ముఖ్యమంత్రి దంపతులకు వస్త్రాలు పంపుతున్న సంఘ నేతలు

జమ్మలమడుగు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సొంత మగ్గాలపై తయారు చేసిన నూతన వస్త్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులకు రిజిస్ట్రర్ పోస్టులో పంపిస్తున్నట్లు పద్మశాలీయ సంఘం కోకన్వీనర్ ఎస్.దశరథ రామయ్య, జిల్లా అధ్యక్షుడు రుద్రమహేశ్వరుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని కుండావారి వీధిలో ఉన్న భద్రావతి, భావనారుషి దేవాలయంలో చేనేత వస్త్రాలను పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో చేనేతలకు ముడిసరుకులు కొనుగోలుపై ఆర్థికసాయం అందించారని, ప్రస్తుతం కూడా అందిస్తామని సీఎం చెప్పారన్నారు. కార్యక్రమంలో చేనేతకార్మిక సంఘం బీజేపీ నాయకుడు ఎస్.వెంకటేశ్వర్లు, పద్మశాలీయ సంఘం జమ్మలమడుగు అధ్యక్షుడు శీలా బాలాజీ, సంఘం కార్యదర్శి వగ్గు జయరాం, ఆరవేటి యతీశ్వర్‌బాబు, కట్టా వినయ్‌కుమార్, పోలంకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి


దివ్యాంగుల సమస్యలపై తెలుసుకుంటున్న యువనేత రితేష్‌రెడ్డి

పోరుమామిళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రభుత్వం అందించే సహాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు టీడీపీ యువనేత రితేష్‌కుమారరెడ్డి అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల్లో అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధుల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రితేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సహాయ పరికరాల కోసం ఇప్పటికే 1100 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా ఎవరైనా అర్హులుంటే బద్వేలు పార్టీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, కొండా రామక్రిష్ణరెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల పరికరాలకు పత్రాల పరిశీలన

బద్వేలు రూరల్/బద్వేలుటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధులకు అవసరమయ్యే పరికరాలకు సంబంధించి ధృవీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో చంద్రమోహన్, ఎమ్మార్వో ఉదయభాస్కర్‌రాజు, మున్సిపల్ కమిషనరు వకమల్ల నరసింహారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి వికలాంగులు, వృద్ధులను పరామర్శించి వారికి అవసరమయ్యే పరికరాలను అధికారులు త్వరితగతిన అందించాలని కోరారు.

క్యాంపును పరిశీలించిన ఆర్డీవో

అట్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అట్లూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ పరికరాల క్యాంపును బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మండలంలో 320 మంది దివ్యాంగులు ఉండగా 104మంది హాజరైనట్లు ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. హాజరుకాని 60ఏళ్ల పైబడ్డ వృద్ధులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులిస్తే వారికి కూడా పరికరాలు అందేలా ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

105 మంది దివ్యాంగులకు పరీక్షలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బి.కోడూరు, బి.మఠం మండలాల దివ్యాంగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రానికి టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈ శిబిరానికి 105 మంది దివ్యాంగులు హాజరైనట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పుల్లయ్య, ఏవో మల్లికార్జునరావు, ఐఈడీ కోఆర్డినేటరు శ్రావణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత కష్టాలపై చలనం లేని ప్రభుత్వం

● ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత కష్టాలపై కూటమి ప్రభుత్వానికి చలనం లేదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం చేస్తే కష్టమే తప్ప భరోసా లేని పరిస్థితి ఉందన్నారు. వైసీపీ హయాంలో రైతు భరోసా రూపంలో ప్రతి ఏడాది రూ.13500 అందించి అండగా ఉన్నామన్నారు. ప్రస్తుతం ఎరువుల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని, ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసి రైతులు ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ధరలు పెంచి ఎరువుల అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్‌బాషా, గాజులపల్లె రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.